క్లుప్తంగా

ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలి



ములుగు : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో గిరిజన జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్ నాయక్ కోరారు. ఈ మేరకు గిరిజన జర్నలిస్టులతో కలిసి సోమవారం జిల్లాకేంద్రంలోని సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో డీపీఆర్ఓ రఫీక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలోని గిరిజన జర్నలిస్టుల వివరాలను అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకులోత్ శరత్, ఉపాధ్యక్షుడు భూక్య సునిల్, సహాయ కార్యదర్శి భూక్య వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో సోమవారం ముఖ్యమంత్రి సహానిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పాలెం గ్రామానికి చెందిన సుంకర చంటికి రూ.25, 500, వెంకటాపురం గ్రామానికి చెందిన సూకరాజుకు రూ.45 వేల చెక్కు, ఇప్పలగూడేనికి చెందిన మంజులకు రూ.9 వేల చెక్కు, మొర్రవానిగూడేనికి చెందిన రాజ్ సీతారాంకు రూ.60 వేల చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లారిశెట్టి మురళి, బాలసాని వేణు, కొండపర్తి సీతాదేవి, రమేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి స్నేహ అన్నారు. సోమవారం మండలంలోని వాడగూడెం, చొక్కల, తిప్పాపురం, వీరభద్రవరం, ఆలుబాక గ్రామల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశీష్, వినయ్, సొహెల్, సిబ్బంది జ్యోతి, మనోహర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



ములుగు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గామాత భక్తులకు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ దంపతుల కుమారుడు జశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు బండారి మోహన్‌కుమార్, అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి. కమిటీ సభ్యులు గట్ల సత్యనారాయణ, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కొత్త సురేందర్, గట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల ప్రశాంత్‌రెడ్డి, మేడికొండ వెంకట్‌రెడ్డి, అన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, ఇంద్రరెడ్డి, సాంబయ్య, నిరంజన్, జశ్వంత్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మొగుళ్లపల్లి: స్థానిక పెద్దవాగు ఆనుకొని ఉన్న గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని దానిని అరికట్టాలని కోరుతూ సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

కోతకు గురైన బీటీ రోడ్డు

- పట్టించుకోని అధికారులు
- రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కోతకు గురైన బీటి రోడ్డు

వెంకటాపురం(కె) : మండలంలోని మహితాపురం గ్రామ శివారులోని మలుపు వద్ద రోడ్డు ప్రమాదకరంగా తయారైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కురిసిన భారీ వర్షాలకు మహితాపురం గ్రామ శివారుల్లో గ్రామానికి వచ్చేందుకు వేసిన బీటీ రోడ్డు కోతకు గురైందని గ్రామస్తులు తెలిపారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదని వాపోయారు. మలుపు వద్ద రోడ్డుకు కోతకు గురికావటం వల్ల రాత్రి సమయాల్లో రోడ్డుపై ప్రయాణించేందుకు, ప్రయాణికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించాలి



భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

– గొంది హనుమంతు (మహితాపురం)

రాత్రి వేళలో భయమేస్తుంది



అత్యవసర పనిమీద రాత్రి వేళలో బయటకు వెళ్లాలంటే భయం వేస్తుంది. మలుపు వద్ద బీటి రోడ్డు కోతకు గురికావడంతో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదం జరుగుతుందని భయపడుతున్నారు.

– గోపాల్ (మహితాపురం)

డ్యాం నిర్మించి సాగునీరందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంపాల రవీందర్

ములుగు రూరల్ : మండలంలోని బొగ్గుల వాగుపై డ్యాం నిర్మించి ఏజెన్సీ గ్రామాల రైతుల పంటకు సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని కన్నాగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గుల వాగుపై డ్యాం నిర్మించినట్లయితే మండలంలోని 20 ఏజెన్సీ గ్రామాలకు సాగు అందించవచ్చని అన్నారు. డ్యాం నిర్మాణానికి సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టి డ్యాం నిర్మాణం సాధిస్తామని అన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వాసం రమేష్, సహాయ కార్యదర్శిగా ధనసరి సారంగపాణి, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అష్మద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

కరాటే అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కరాటే మాస్టర్ అబ్బు

ఏటూరునాగారం : కరాటే అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పునాకోషి షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఇండియా కార్యదర్శి అబ్బు మాస్టర్ అన్నారు. సంస్థ వార్షిక సమావేశం సోమవారం మండల కేంద్రంలో జరిగింది. సమావేశంలో రాష్ట్రానికి చెందిన వివిధ జిల్లాల సీనియర్ కరాటే మాస్టర్స్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి పునకోషి సంస్థ అధ్యక్షుడు అబ్బు హాజరై మాట్లాడుతూ కరాటే అభివృద్ధికి ప్రతి మాస్టర్స్ శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ఉత్తమ క్రీడాకారులు తయారు చేయడానికి నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కోరారు. కరాటే క్రీడా స్పోర్ట్స్ కోటాలో ఉన్నందున ప్రతి మాస్టర్ విద్యార్థులను గుర్తింపు పొందిన టోర్నమెంట్‌ను ఆడించి విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాను పొందేలా చూడాలని వివరించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికలకు కరాటే సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాంను మాస్టర్ అందరూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి ములుగు జిల్లా వైస్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్, కబ్బాక జగదీశ్వర్ రావు, సంస్థ సలహాదారు ఎండీ.ఖాజా పాషా పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి

మంగపేట : దసరా పండుగ సందర్భంగా దొంగలు చేతివాటానికి పాల్పడే అవకాశం ఉన్నందున చోరీల నియంత్రణపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టీవీఆర్ సూరి సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పండుగ సందర్భంగా పిల్లలకు సెలవులు ఉండటంతో చాలామంది తమ సొంతగ్రామాలకు గాని ఇతర బంధువుల వద్దకు పట్టణాలకు ప్రయాణాలు చేస్తుంటారు. దీన్ని అదునుగా చేసుకుని దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉంటుందన్నారు. ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవడం క్షేమంగా ఉంటుందన్నారు. ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలని, ఊరికివెళ్లే ముందు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలన్నారు. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీలు, కార్లలో ఉంచొద్దని సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను వారి ఇంటి ఆవరణలో ఉంచాలని రోడ్లపై ఉంచొద్దని సూచించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో గస్తీకి ఏర్పాటుకు సహకరించాలని అనుమానాస్పదంగా తమ వీధుల్లో ఎవరైనా కొత్త వ్యక్తుల కదలికలపై 100 నంబర్ లేదా స్థానిక పోలీస్‌స్టేషన్ 8712670092, 8712670093 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించవచ్చన్నారు. అవాంఛనీయమైన సంఘటనలు జరుగకుండా పండుగ జరుపుకోవాలని ఎస్సై కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కాటారం(మహాముత్తారం): ఇంట్లో నుంచి వెళ్లి పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహాముత్తారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన కొటం వెంకటస్వామి (52) కుటుంబ సభ్యులతో గొడవపడి కోపంతో శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటస్వామి ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం పత్తి చేను వైపుగా వెళ్లిన వారు వెంకటస్వామి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు..



బస్సులో నుంచి దిగుతున్న ప్రయాణికులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్‌లో ఆర్టీసీ బస్సు స్టీరింగ్ సమస్య ఏర్పడటంతో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దుసూకెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 50 మంది ప్రయాణికులతో వెంకటాపురం నుంచిభద్రాచలం వెళ్తుందని తెలిపారు. కాగా వేపచెట్టు సెంటర్‌లో బస్సు స్టీరింగ్‌లో సమస్య ఏర్పడటంతో బస్సు అదుపు తప్పిందని తెలిపారు. డ్రైవర్ సైదులు చాకచక్యంగా బస్సును అదుపు చేయటంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులను భద్రాచలం డిపోకు చెందిన వేరే బస్సులో ఎక్కించి పంపించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట వాగు నుంచి పరకాలకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్ యాజయానులు టేకుమట్ల మండలం అరెపల్లి గ్రామానికి చెందిన గజ్జి రమేష్, ఎండీ చాంద్ పాషా, గుమ్మడవల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి అనిల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యల తీసుకుంటామన్నారు.

ఆదిలోనే ఆటంకం

- నిలిచిన చీరల పంపిణీ



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న అధికారులు

మంగపేట: బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆదిలోనే ఆటంకం కలిగింది. ప్రభుత్వం సద్దుల బతుకమ్మ, దసరా పండుగ కానుకగా మహిళలకు చీరల పంపిణీ చేసేందుకు రెండు రోజులకు ముందే ఆయా మండలాలకు చేరవేసింది. స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని సభ్యులతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి గిరిజన మహిళకు చీరలను అందచేసేందుకు రెవెన్యూ, మండల పరిషత్, ఐకేపీ అధికారులు ఆయా గ్రామాలకు కేటాయించిన చీరలను పంచాయతీ కార్యాదర్శుల ద్వారా గ్రామాలకు చేరి ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మధ్యాహ్నం నుంచి కార్యక్రమాన్ని నిలిపి వేయాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో తాత్కాలికంగా నిలిపి వేశారు. అప్పటి వరకు చీరలను తీసుకునేందుకు వచ్చిన మహిళలు కార్యక్రమాన్ని నిలిపి వేయడంతో నిరుత్సాహంతో వెనుదిరిగి పోవాల్సి వచ్చింది. చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా కాకుండా కేవలం నాలుగు ఐదు జిల్లాల్లో మాత్రమే నిర్వహించడంతో ప్రభుత్వంపై విమర్శలు రావడంతో కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపి వేసినట్లు ప్రచారం సాగింది. ఈనెల 15 నుంచి చీరల పంపిణీ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కొందరు అధికారుల ద్వారా అందిన సమాచారం. ఈ విషయంపై ప్రభుత్వం లేదా జిల్లా ఉన్నతాధికారులు స్పష్టమైన సమాచారాన్ని వెల్లడిస్తే తప్ప ఊహాజనిత అనుమానాలకు సమాధానం దొరికే అవకాశం లేదు.

కొన్ని గ్రామాల్లో పంపిణీ

మండలంలోని 25 గ్రామపంచాయతీల పరిధిలోని మహిళా పొదుపు సంఘాలలోని మ హిళలకు ప్రభుత్వం సద్దుల బతుకమ్మ, దసరా పండుగ కానుకగా పంపిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీడీఓ భద్రుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేశ్వర్‌రావు మాట్లాడుతూ మండలంలోని 25 జీపీ పరిధిలోని 1179 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని సభ్యులకు ప్రభుత్వం ద్వారా 10,146 చీరలు వచ్చాయన్నారు. వాటిని పొదుపు సంఘాలలోని సభ్యులతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఆదివాసీ గిరిజన మహిళకు అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు, మంగపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ నర్రా శ్రీధర్, రూప్‌సింగ్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేశాం



మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపి వేశాం. కారణం ఏమిటనే సమాచారం తమకు తెలియరాలేదు.

– మల్లేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, మంగపేట

ఆస్పత్రిలోని సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న నాయకులు

రేగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పెంట రవి అన్నారు. సోమవారం సీపీఐ జిల్లా నాయకులతో కలిసి ఆస్పత్రిలోని సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. ప్రతీ రోజు వందల మంది వచ్చే ఆస్పత్రిలో తాగునీటి వసతి కల్పించలేని స్థితిలో అధికారులు ఉన్నారన్నారు. ఎక్స్‌రే, ఈసీజీ మిషన్ పని చేయక నెలలు గడుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. గర్భిణులకు అవగాహన కల్పించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ల శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

టేకుమట్ల: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం తెల్లవారు జామున మండల కేంద్రంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో చిట్యాల మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన చెలపాక ఆంజనేయులు కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం నుంచి టేకుమట్ల మీదుగా పీడీఎస్ బియ్యాన్ని టాటాఏస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బియ్యంతోమ పాటు, వాహనాన్ని సీజ్ చేసి చెలపాక ఆంజనేయులుతో పాటు, వాహన డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

గుడుంబా..

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామంలోని పలు ఇళ్లపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై తమాషారెడ్డి

పలిమెల: మండలంలోని ముకునూర్ చెందిన తిప్పనపల్లి సాగర్ ఇటీవల పనిచేసే చోట తన మొబైల్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై తమాషారెడి ఆదేశాల మేరకు టెక్ టీం ఆపరేటర్, కానిస్టేబుల్ సంతోష్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ ఆచూకీ కనుకొని తిరిగి యజమానికి సాగర్‌కు సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై తమాషారెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వీలైనంత త్వరగా అచూకీ కనుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సంతోష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు



ఏటూరునాగారం : హోమంలో పాల్గొన్న భక్తులు



మొగుళ్లపల్లి : పూజలు చేస్తున్న భక్తులు



టేకుమట్లలో..

ఏటూరునాగారం/టేకుమట్ల/మొగుళ్లపల్లి: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఏటూరునాగారం, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో నేరేళ్ల రామకృష్ణగౌడ్, లింగారెడ్డి, జక్కుల కిరణ్, మోతె రాజమౌళి, రాంరెడ్డి, రాజాచారి, రఘోత్తం, రవీందర్, వెంకటేశ్వర్, శివ, సంతోష్, పాల్గొన్నారు. మొగుళ్లపల్లిలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత సోమవారం ఐదో రోజు అమ్మవారు లలితాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు, అన్నారెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన సొత్కు రాజయ్య భార్య సంధ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని రాజయ్య బాల్య మిత్ర బృందం సోమవారం పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. బాల్య మిత్రులు సోరుపాక సదానందం, పోషిణి శ్రీనివాస్, నేరేళ్ల సునీల్, కారుపాకల తిరుపతి, సామల రాజు, ముంజాల ఐలయ్య, పొన్నం శ్రీనివాస్, రవీందర్, కాసూరి సంపత్, కానుగంటి దేవేందర్ పాల్గొన్నారు.

దుర్గామాత వద్ద మహాచండీ హోమం



కాటారం: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మహా చండీహోమం నిర్వహించారు. పురోహితులు కృష్ణమోహన్ వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి హోమం జరిపించారు. అంతకముందు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సంఘం సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అణచివేత రూపుమాపడమే లక్ష్యం



మాట్లాడుతున్న రాజేందర్

కాటారం(మహాముత్తారం): సమాజంలోని పేద ప్రజల దోపిడీ, అణచివేతను రూపుమాపడమే లక్ష్యంగా ఎర్రజెండా పని చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ అన్నారు. మండలంలోని పోలంలపల్లిలో సీపీఐ(ఎం) పార్టీ ద్వితీయ మండల మహాసభలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలం రాజేందర్ మాట్లాడుతూ.. దేశంలో పలు బూర్జువ భూస్వామ్య పార్టీలు ఎర్రజెండాను అంతం చేయడానికి అనేక కుట్రలు పన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏ. శ్రీకాంత్, మానేటి బాబు, సునీతతో పాటు తదితరులు పాల్గొన్నారు.